

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 1 జనవరి 2024





నూతన సందడి

- కొత్త ఏడాదికి స్వాగతం పలికిన జిల్లా ప్రజలు
- అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి వేడుకలు


ఆదివారం అర్ధరాత్రి శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో యువకుల కేరింతలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 31: కాలగర్భంలో మరో సంవత్సరం కలిసిపోయింది. 2023కు వీడ్కోలు చెబుతూ.. 2024కు ఘన స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి కేక్‌లను కట్‌చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. క్రైస్తవులు చర్చిలు, ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గతానికి బైబై చెబుతూనే కొత్త సంవత్సరంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని జిల్లా ప్రజలు భగవంతుడిని ప్రార్థించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పుష్పగుచ్ఛాలు, స్వీట్స్, పండ్ల దుకాణాలు కిటకిటలాడాయి. వివిధ ఆకారాల్లో కేక్‌లను విక్రయించారు. మద్యం దుకాణాల్లోనూ అర్ధరాత్రి వరకూ జోరుగా విక్రయాలు సాగాయి.


శ్రీకాకుళంలోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధం చేసిన కేకులు

అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు..

టెక్కలి: జిల్లా ప్రజలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కొత్త ఏడాదిలో ప్రజలు సుఖ, సంతోషాలతో వర్థిల్లాలని, రైతులు, కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులు, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాలు కొత్తపుంతలు తొక్కాలని ఆకాంక్షించారు.

● **ఎల్.ఎన్.పేట:** నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి తరణి ప్రసాద్ మిశ్రా వంశధార నదీ తీరంలో ఆదివారం సైకత శిల్పాన్ని రూపొందించారు. 2024కు స్వాగతం పలుకుతూ సైకత శిల్పాని తీర్చిదిద్దారు.

మీకో దండం జగనన్నా

- మా సమస్యలు పరిష్కరించండి
- అంగన్‌వాడీల వినూత్న నిరసన


ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద మీకో దండం జగన్ అంటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

అరసవల్లి/ఇచ్ఛాపురం, డిసెంబరు 31: తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద అంగన్‌వాడీలు 'మీకో దండం జగనన్నా.. మా సమస్యలు పరిష్కరించాలి' అని వినూత్నంగా నిరసన తెలిపారు. శ్రీకాకుళంలో అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరి సమ్మె శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకవైపు అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే మరోవైపు ప్రభుత్వం సెంటర్ల తాళాలు పగులగొట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం దారుణ మని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వారికి కేవలం వెయ్యి రూపాయలు వేతనం మాత్రమే పెంచిందని, పెరిగిన ధరలతో తమ కుటుంబాలను ఎలా నెట్టుకు రాగలరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంగన్‌వాడీలను సంక్షేమ పథకాలకు దూరం చేయడం అన్యాయం అన్నారు. శిబిరంలో ఆట-పాట కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, రాష్ట్ర అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.కళ్యాణి, రాజేశ్వరి, ప్రమీలాదేవి, పాల్గొన్నారు.

పోరాటం ఆపేది లేదు..

- పర్మినెంట్ చేయాల్సిందే..
- ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్

అరసవల్లి, డిసెంబరు 31: తమను పర్మినెంట్ చేయాల్సిందేనని, అప్పటి వరకూ పోరాటం ఆపేది లేదని సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 12వ రోజు ఆదివారం సమ్మెను కొనసాగించారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగుల శిబిరాన్ని ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్షుడు వి.కామేశ్వర రావు సందర్శించి మద్దతు తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించి సకాలంలో జీతాలు చెల్లించాలని, ఎంటీఎస్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ అప్పలనాయుడు, సమగ్రశిక్ష ఉద్యోగుల యూనియన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కోశాధికారి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


శ్రీకాకుళంలో సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

మంత్రి అప్పలరాజు కొండలు మింగారు

- వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
- ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- టీడీపీలో 250 కుటుంబాలు చేరిక


టీడీపీలో చేరిన మహిళలతో ఎంపీ రామ్మోహన్, శిరీష

పలాస, డిసెంబరు 31: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజు కొండలు, కాలువలు మింగారని.. రానున్న ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం రాత్రి పలాస 31వ వార్డులో వైసీపీ నుంచి 150 కుటుంబాలు, మండలంలోని లొత్తూరు పంచాయతీ నుంచి 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారందరికీ ఎంపీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. సొంత చెల్లిని సాగనంపిన ముఖ్యమంత్రి ఆడబిడ్డలను ఆదుకుంటామని వాగ్దానాలు చేస్తున్నారని, ప్రజలు ఆయన మాటలు నమ్మే స్థితిలో లేరని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఆయన్ను నమ్మి ప్రజలు ఒక్కచాన్స్ ఇస్తే వారికి బోడిగుండు చేశారని, చివరకు రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. దొంగలు రాష్ట్రాన్ని ఏలితే ఏ విధంగా ఉంటుందో రాష్ట్ర ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, రూ.80 ఉన్న మద్యం క్వార్టర్ బాటిల్ రూ.300 వరకూ పెంచారని, మత్తుకోసం మందు తాగితే ప్రజలు మెంటలైపోతున్నారని ఉదహరించారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు అన్నీ పండగలకు కానుకలు ఇచ్చేవారని, ప్రస్తుతం కానుకలు ఎత్తేసి నిత్యావసరాల ధరలు అమాంతంగా పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సీఎం ఎస్సీ, ఎస్టీలను ఓట్లు కోసమే వినియోగించుకుంటున్నారని, సబ్‌ప్లాన్ నిధులన్నీ పక్కదారి పట్టించారని విమర్శించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, మునిసిపల్ పారిశుధ్య కార్మికులు సమస్యలు పరిష్కరించాలని రోడ్డెక్కితే నిమ్మకునీరెత్తినట్లు సీఎం వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఒక్కసీటు ఇవ్వకుండా అడ్డుకోవాలని ఆయన కోరారు. పలాసలో గౌతు శిరీషకు ప్రజలు ఆశీర్వదించాలని, మహిళగా అనేక కార్యక్రమాలు ఆమె చేయగలరని, భారీ మెజార్టీ ఇవ్వాలని ప్రజలను కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లా డుతూ.. మంత్రి అప్పలరాజు ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. తమ కార్యక్రమాలకు రాకుండా అడ్డుకున్నా వేలాదిగా తరలిరావడంతో ఆయనకు ఓటమి భయం పట్టుకుందన్నారు. ఆయనకు ప్రజలు మరో రెండు నెలల్లో గుడ్‌బై చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మాట్లాడుతూ.. ప్రజలకు భయపెడితే చూస్తు ఊరుకోమని స్పష్టం చేశారు. టీడీపీ కార్యక్రమాలకు హాజరైతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామని వైసీపీ నాయకులు బెదిరించడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, కొరికాన శంకర్, గోపి, గురిటి సూర్యనారాయణ, రామకృష్ణ, సత్యం, చంద్రరావ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


అమృత్ భారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ

పేదల కోసమే అమృత్ భారత్ రైలు

- ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస, డిసెంబరు 31: బడుగు, బలహీన వర్గాల ప్రయాణాల కోసమే కేంద్ర రైల్వే శాఖ అమృత్ భారత్ పేరిట రైలును ఏర్పాటు చేసిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మాల్దా టౌన్-బెంగళూరు మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన అమృత్ భారత్ రైలును ఆదివారం శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో ఎంపీ రామ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో రెండు అమృత్ భారత్ ట్రైన్లను ప్రారంభించారని, ఇందులో ఒకటి జిల్లాలో రాకపోకలు సాగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లాకు చెందిన ఎంతో మంది కూలీలు వలసలు వెళ్లేటప్పుడు ఈ రైలు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శ్రీకాకుళం రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు, ఊసవానిపేట వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి అధికారులు సహకరించాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రైల్వే ఏడీఎఆర్‌ఎం ఎస్‌కే గుప్తా పాల్గొన్నారు.

కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె

అరసవల్లి, డిసెంబరు 31: మునిసిపల్ కార్మికుల సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. శ్రీకాకుళం, ఆమదా లవలస, పలాస, ఇచ్ఛాపురం మునిసిపాలిటీల్లో నిరసనలు కొనసాగిస్తున్నారు. శ్రీకాకుళంలో చేపట్టిన సమ్మెలో యూని యన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.బలరాం, అర్జి రాము, యుగంధర్, భాస్కరరావు, ఆకుల శంకర్, మాధవి, జనార్దనరావు, బుచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ జగన్?

వజ్రపుకొత్తూరు: ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని పాద యాత్రలో ఇచ్చిన హామీ ఏమైందని జనసేన పలాస సమన్వయకర్త వి.దుర్గారావు ప్రశ్నించారు. ఆదివారం గరుడభద్రలో జనసైనికులు, టీడీపీ నాయకులతో కలిసి 'జనం జనం జనసేన ప్రభంజనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2.30 లక్షల ఉద్యోగాల ఖాళీలున్నాయని, అయితే నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను సీఎం జగన్ మోసం చేశారని విమర్శించారు.

దీనివల్ల ఉపాధి లేక యువత ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని, ఆ వెంట నే ఉద్యోగ నోటిఫికేషన్లు విడు దల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.మోహనరావు, ఎరుపల్లి అప్పలస్వామి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతం చేయాలి

నరసన్నపేట: రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని, దీనిని అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పట్టణ నాయకులు బోయన సతీష్, తాళాభక్తుల గోవిందరాజు అన్నారు. ఆదివారం పట్టణంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ని ఇంటికి పంపకపోతే రాష్ట్రానికి భవిష్యత్తు ఉండదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి అధినేత చంద్రబాబు నాయుడును సీఎంగా చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఉపాధి

జలుమూరు (సారవకోట): రాష్ట్రంలో యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు టీడీపీ తోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. తొగిరి పంచా యతీ తర్లి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యా లపై ప్రజలకు చైతన్యం చేశారు. టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత పిళ్లా నందకిశోర్, టీడీపీ నాయకులు జోగారావు, అప్పారావు, డి.జయరాం తదితరులు పాల్గొ న్నారు.

రానున్న ఎన్నికల్లో ఆదివాసీ సంఘం పోటీ

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నేతలు

జలుమూరు (సారవకోట): ఆదివాసీల సంస్కృతి బతికి ఉండాలంటే పోరాటాలు చాలవని, రాజ్యాధి కారం అవసరమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, ప్రధాన కార్యదర్శి కుంజు శ్రీను అన్నారు. ఆదివారం పురుషోత్తకర్ర మామిడి తోట లో ఆదివాసీల ఆత్మీక కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. అసెంబ్లీలో ఆదివాసీల గురించి, చట్టాల గురించి మాట్లాడేవారు లేకపోవడం వ ల్ల తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సంక్షేమ పరిషత్ తరఫున రాష్ట్రంలోని 9 అసెంబ్లీ స్థానాలు, 3 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసీలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వం లో అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మెళియాపుట్టి జడ్పీటీసీ గూడా ఎండయ్య, సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గురాడ అప్పన్న, గిరిజన నాయకులు బింజన్న, చింతప ల్లి భాస్కరరావు, వడాల మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సభకు అచ్చెన్నకు ఆహ్వానం



వజ్రపుకొత్తూరు: గుజరాత్‌లో ఈ నెల 14న జరగనున్న మత్స్యకార సభకు హాజరుకావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును ఆ సంఘ నేతలు ఆహ్వానించారు. మం డలంలోని ఉద్దాన ప్రాంతానికి చెందిన మత్స్యకార నాయకులు వంక రామారావు, మూగి రాజేష్ తదితరులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందించారు.

నిబంధనలు పాటించండి

నరసన్నపేట: బైక్ రైడింగ్‌లకు పాల్పడకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని సీఐ బి.ప్రసాదరావు అన్నారు. ఆదివారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే ఏడాదిలో నరసన్నపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తవ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాల న్నారు. ఇంటి ముందుకు ఉంచిన ద్విచక్ర వాహనాలు కదల కుండా వీల్స్‌కు తాళాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సేవలను విస్తృతం చేయాలి

టెక్కలి: భగవాన్ సత్యసాయి సంస్థలు సేవలను విస్తృతం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు కోరారు. ఆదివారం స్థానిక సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా భవనంలో జిల్లాలోని భజన మండళ్ల కన్వీనర్లు, సమన్వయకర్తలు, పదాధికారులు, బాలవికాస్ గురువులతో సమావేశం నిర్వహించారు. ప్రేమతరువు కింద మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గంగుల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పలాసరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. బ్రాహ్మణతర్లాలో ఆదివారం ఏర్పాటు చేసి న కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జనవరి ఒకటి నుంచి సామాజిక పెన్షన్లను రూ.3 వేలకు పెంచి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకట రమణ, సర్పంచ్ బి.పుష్ప, ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మరిన్ని సేవలు

పోలాకి: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు స్థానికంగానే అందిస్తు న్నామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలోని నూతన సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారం భించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వర రావు, సర్పంచ్ మజ్జిరమణమ్మ, ఎంపీటీసీ తూలుగు అశోక్,డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు నిమ్మాడ ముస్తాబు

టెక్కలి: నూతన సంవత్సర వేడుకలకు నిమ్మాడ గ్రామం ముస్తాబైంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మె ల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడులకు శుభా కాంక్షలకు తెలిపేందుకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానుండడంతో వారి స్వగ్రామంలో అవసరమైన బారికేడ్లు, క్యూలైన్లు, తాగునీరు ఏర్పాటు చేశారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

పాతపట్నం: పీఆర్టీయూ మండల శాఖ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా బొట్ట మిన్నారావు, అసోసియేట్ అధ్యక్షుడిగా అంపోలు రమేష్ కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా సారికి రామారావు, నర్సింగ్ ప్రసాద్ నాయక్‌లను ఎన్ను కున్నట్లు సంఘ అధ్యక్షుడు భీంసేన్ పండా తెలిపారు. ఆదివారం స్థానిక మండల పరి షత్ ప్రాథమిక పాఠశాల (ఒడియా)లో సంఘ ఎన్నికల నిర్వహించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



వజ్రపుకొత్తూరు: కేంద్ర ప్రభు త్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ కోరారు. ఆదివారం పూడి జగన్నాథ పురంలో వికసిత్ భారత్ చేపట్టారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం పేదలకు 17 పథరాలను అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు 'బగ్గు' సంఘీభావం

జలుమూరు (సారవకోట): అంగన్‌వాడీలు చేపడు తున్న సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం సంఘీభావం తెలిపారు. టీడీపీతోనే అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీలో శ్రీముఖలింగం ప్రధానార్చకుడి ధర్నా

న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో దక్షిణ కాశీగా పేరు పొందిన ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీముఖ లింగేశ్వర ఆలయ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయిం చడం లేదని పేర్కొంటూ ఆలయ ప్రధానార్చకుడు నాయు డుగారి రాజశేఖర్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కిందట రూ.20 కోట్లు కేటాయించినప్పటికీ ఆ నిధులు వెనక్కి మళ్లాయని, ఆ మొత్తాన్ని చర్చిలకు ఉపయోగిం చిందని ఆరోపించారు. ఆలయ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రధాని కార్యాలయంతో పాటు కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేకపోయింద న్నారు. శ్రీముఖలింగ క్షేత్రానికి ప్రపంచ వారసత్వ జాబి తాలో చేర్చేందుకు అర్హతలున్నా సదుపాయాలు లేవన్నారు.

రేపు పెన్షనర్ల సంఘ సమావేశం

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక సంఘ భవ నంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రోణంకి రామ చంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్‌లో లైఫ్ సర్టిఫికేట్ల సమర్పణ, సీఎఫ్ఎంఎస్‌లో లాగిన్, ఈహెచ్ఎస్ కార్డుకు దరఖాస్తులపై అవగాహన కలిగించ నున్నామన్నారు. ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురు షోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయి రాం హాజరవుతున్నారని, పెన్షనర్లందరూ రావాలన్నారు.

మైనార్టీలకు ఎమ్మెల్యే స్థానం కేటాయించాలి

కవిటి: ఆంధ్రప్రదేశ్‌లో మైనార్టీలు అధికంగా ఉన్న చోట రాజ కీయ పార్టీలు ఎమ్మెల్యే స్థానాన్ని కేటాయించాలని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు కోరారు. ఆదివారం విండ్యగిరి గ్రామంలో ఒడియా మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడియా మాతృభాష కలిగిన వ్యక్తికి చట్టసభల్లో ప్రాధాన్యం కల్పిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ మేరకు రాజకీయ పార్టీలు ఆలోచన చేయాలన్నారు. కార్యక్ర మంలో ఒడిశా ఎమ్మెల్యే విక్రమ్ పండా, ఏపీ మైనార్టీసంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, కుమార్ నాయక్, కృష్ణ రౌళో, భాస్కర పాడి, పి.శేఖర్ పాల్గొన్నారు.

దగాకోరు ప్రభుత్వాన్ని సాగనంపండి

● మాజీ మంత్రి కళావెంకటరావు

జి.సిగడాం: రాష్ట్రంలో దగాకోరు ప్రభుత్వం రాజ్య మేలుతుందని ఈ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు పిలుపునిచ్చారు. ఆదివారం శేతుభీమవరం పంచాయతీ గంగన్నదొరపాలెంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. జగన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నవరత్నాలు పేరుతో నవమోసాలు చేశాడని ఆరోపించారు. కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, కుదిరెళ్ల బుజ్జి, కూనుబిల్లి కూర్మారావు, పైల రామకృష్ణ, జక్కంపూడి దాసు, మహదాశ్యం చిన్నారావు, కోన వెంకటరావు, ఆరెళ్ల గోళ్లాజీ, సబ్బి రాము, పిల్లల శ్రీనివాసరావు, అప్పారావు, బంగారినాయుడు ఉన్నారు.


జి.సిగడాం: మాట్లాడుతున్న కళావెంకటరావు

వైసీపీ అన్నింటా విఫలం

లావేరు: వైసీపీ ప్రభుత్వం అన్నింటా విఫలమైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆరంగిపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్య దొర, పెదరావుపల్లి సర్పంచ్ హేమసుందరరావు, పార్టీ నేతలు ప్రకాశరావు, ఎల్.జగన్నదొర పాల్గొన్నారు.

3న రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ సదస్సు

● జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్


విలేకరులతో మాట్లాడుతున్న శంకర్

శ్రీకాకుళం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చాంబర్ ఆధ్వర్యంలో జనవరి 3న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నిధులు, అధికారాలను దొంగలించి 3.5కోట్ల గ్రామీణ ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. అందుకే రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాలో అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జనవరి 3న బుధవారం తాడేపల్లిలో ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీముత్యాలరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించినట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమం చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రెండో దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని స్పష్టంచేశారు.

● **గార:** మంగళగిరిలో ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పంచాయతీ రాజ్ సదస్సుకు శ్రీకాకుళం నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులంతా పార్టీలకు అతీతంగా రావాలని నియోజకవర్గ సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు కొంక్యాన ఆదినారాయణ, ఉపాధ్యక్షురాలు రుప్ప లక్ష్మీ కోరారు. ఆదివారం సాయంత్రం గారలో మండల టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

కళాపై విమర్శలు సిగ్గుచేటు

ఎచ్చెర్ల: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావుపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని టీడీపీ నేతలు అన్నారు. ఎచ్చెర్లలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న కళావెంకటరావు ఎలాంటి అవినీతి మరకలు లేకుండా కొనసాగుతున్నారన్నారు. రాష్ట్రంలోనే అతి కీలకమైన పదవులు చేపట్టిన కళా వెంకటరావును విమర్శించే స్థాయి మీది కాదని వైసీపీ నేతలను ఉద్దేశించి అన్నారు. లావేరు మండలానికి చెందిన జగన్ పత్రిక విలేకరి దామోదరరావు ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గాలి వెంకటరెడ్డి, బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, కొత్తకోట అమ్మినాయుడు, టంకాల మౌళీశ్వరరావు, బోర శ్రీనివాసరావు, గట్టెం శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ పునరుద్ధరించేవారికే మా మద్దతు'

అరసవల్లి: పాత పెన్షన్ పునరుద్ధరించేవారికే రానున్న ఎన్నికల్లో మా మద్దతు ఉంటుందని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి తలగాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత పెన్షన్ పునరుద్ధరించే వారికే మా ఓటు నినాదంతో, జనవరి 28న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని, ఈ ర్యాలీలో జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కరిమి రాజేశ్వరరావు, బాడాన రాజు, శరత్‌బాబు, గేదెల రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

117 జీవోతో ప్రభుత్వ విద్య సర్వనాశనం

అరసవల్లి: ప్రభుత్వం 117 జీవోను తీసుకువచ్చి సర్కారు విద్యను సర్వనాశనం చేసిందని ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ విమర్శించారు. ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక క్రాంతి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పడాల తమ్మినాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగింది. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పి.సుబ్బరాజు, శ్రీనివాస్ పట్నాయక్, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను మోసగించిన ప్రభుత్వం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ఆమదాలవలస: ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం మోసగించిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆరోపించారు. ఆదివారం ఆమదాలవలస టీడీపీ కార్యాలయంలో రవికుమార్ విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ 83 శాతం హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరుచేసి పనులు ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. టీడీపీ నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, అంబళ్ల రాంబాబు, బొడ్డేపల్లి గౌరీపతిరావు పాల్గొన్నారు.

మోసగించిన జగన్‌కు బుద్ధిచెప్పండి

ఆమదాలవలస: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి తర్వాత మాటతప్పిన సీఎం జగన్‌రెడ్డికి బుద్ధిచెప్పాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కోరారు. ఆదివారం ఆమదాలవలస మెయిన్‌రోడ్డు మునిసిపల్ కాంప్లెక్స్ వద్ద ఆరో రోజు సమ్మె నిర్వహిస్తున్న మునిసిపల్ పారిశుధ్య కార్మికుల శిబిరం వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు.

● **ఇచ్ఛాపురం:** సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మునిసిపల్ పారిశుధ్య కార్మికులు ఇచ్ఛాపురం మునిసిపల్ కార్యాలయం వద్ద మౌన వ్రతంతో నిరసన తెలిపారు.

'వేధింపులే నా భర్త చావుకు కారణం'

లావేరు: నా భర్త జి.దామోదరరావు (జగన్ పత్రికలో విలేకరి) మృతికి స్థానిక అధికార పార్టీ నాయకుల వేధింపులే కారణమని అతడి భార్య సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె తన స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. మాకు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేవని, రాజకీయ నాయకుల వేధింపుల వల్లే నా భర్త మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త మృతిపై సమగ్ర దర్యా ప్తు చేసి, న్యాయం చేయాలని కోరారు. కాగా దామోద రరావు మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని టీడీపీ నేత కిమిడి కళావెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం కేశవరాయపురం గ్రామంలో దామోదరరావు ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

అరసవల్లి: ప్రగతిశీల మహిళా సంఘం అర్ధశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రమణి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పీవోడబ్ల్యూ జిల్లా కార్యాలయం ఆవరణలో నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు మాట్లాడి, పలు తీర్మానాలను ఆమోదించారు.

రైల్వే అధికారుల తీరుపై బీజేపీ నాయకుల ఆగ్రహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన అమృత భారత్ రైలు ప్రారంభం పురస్కరించుకుని రైల్వే అధికారులు తమను అవమానించారని కొందరు బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే రైల్వే అధికారులు సమావేశ నిర్వహన సమయంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, స్పీకర్ తమ్మినేని సీతారాం, ఏడీఆర్ఎం ఎస్‌కే గుప్తాలను వేదికపైకి ఆహ్వానించి, బీజేపీ నుంచి ఏ ఒక్కరిని కూడా ఆహ్వానించలేదు. దీంతో బీజేపీ నాయకులు కిల్లి శ్రీరామ్మూర్తి రైల్వే అధికారుల తీరును నిరసించారు. ఆ తర్వాత రైల్వే అధికారులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావును వేదిక మీదకు ఆహ్వానించడంతో ఆ పార్టీ నాయకులు శాంతించారు.

● **ఆమదాలవలస:** ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో పోలీసు జాగిలాలతో అనుమానాస్పదంగా కనిపించిన లగేజీ బ్యాగులను ఆదివారం ఎస్ఈబీ సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సోదాల్లో ఎటువంటి నేరాలకు సంబంధించిన వస్తువులు దొరకలేదని ఆమదాలవలస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

పిక్నిక్ ఘటనలో మరొకరి మృతి

ఇచ్ఛాపురం: మందస మండలం సిగలపట్టుగ సమీపంలోని రట్టి సముద్ర తీరంలో గత నెల 26న పిక్నిక్‌కు వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందగా, ఇద్దరు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరిలో ఆదివారం సాయంత్రం ఇచ్ఛాపురం గొల్లవీధికి చెందిన దక్కత చంద్రశేఖర్(14) అనే విద్యార్థి మృతి చెందాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న చంద్రశేఖర్, ఆశి జయరామ్, ఎస్.మేఘన రట్టి వద్ద సముద్రంలో స్నానం చేస్తుండగా అలలు తాకిడికి జయరామ్ గల్లంతై మృతి చెందాడు. చంద్రశేఖర్, మేఘన నీరు తాగేయడంతో అస్వస్థతకు గురయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న వీరిద్దరినీ శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చంద్రశేఖర్ మృతి చెందాడు. చంద్రశేఖర్ ఎన్‌సీసీలో చురుకుగా ఉండేవాడు. తండ్రి దక్కత లింగరాజు ఆటో డ్రైవర్, తల్లి దమయంతి గృహిణి, అక్క శైలజ ఇంటర్, చెల్లి సంగీత ఏడోతరగతి చదువుతోంది. చంద్రశేఖర్ మృతితో ఇచ్ఛాపురం గొల్లవీధిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మందస పోలీసులు కేసు నమోదు చేశారు.

చీడివలసలో అగ్నిప్రమాదం

బూర్జ: చీడివలస గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో చించిలి కృష్ణకు చెందిన పురిపాక దగ్ధమయింది. కుమ్మరి వృత్తి చేసుకుని జీవనోపాధి పొందేవారిమని, ప్రస్తుతం ఉపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

గొప్పిలిలో చోరీ

మెళియాపుట్టి: గొప్పిలి గ్రామంలోని సోమేశ్వరరావు ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్టు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. సోమేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి పది రోజుల కిందట హైదరాబాదులోని తన కూమార్తె వద్దకు వెళ్లారు. తిరిగి శనివారం సాయంత్ర ఇంటికి వచ్చి తలుపులు తీసేసరికి బీరులో దుస్తులు చిందవందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం క్లూస్‌టీం వచ్చి పరిశీలించి ఆధారాలు సేకరించింది. ఈ ఘటనలో ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు సోమేశ్వరరావు ఫిర్యాదులో పేర్కొ న్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆదిత్యుని సేవలో అనకాపల్లి జిల్లా న్యాయాధికారి



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని అనకాపల్లి జిల్లా న్యా యాధికారి శివకిరణ్ సతీసమే తంగా ఆదివారం దర్శించుకున్నారు. వేద మంత్రాలతో అర్చనలు చేశారు. స్వామివారి జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు అందజేశారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.2,37,644 ఆదాయం లభించింది.

మద్యం అమ్మకాల సమయం పెంపు

శ్రీకాకుళంక్రైం: నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో, అర్ధరాత్రి దాటి ఒంటి గంట వరకు బార్ అండ్ రెస్టారెంట్లలో అమ్మకాలు చేపట్టవచ్చని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఎన్డీపీఎస్ యాక్ట్ కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నిబంధనలు పాటించని బార్ అండ్ రెస్టారెంట్లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.